సాక్షి
అనంతపురం

శనివారం । 16 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు, కనిష్టం రూ.9 వేలు ప్రకారం ధర పలికాయి.



టమాట కిలో రూ.42

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.42, కనిష్టం రూ.34, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.5°/21.8°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

మాజీ సైనికులకు ఉచిత న్యాయ సేవలు



లీగల్ సర్వీసెస్ క్లినిక్ ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి భీమారావు

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా మాజీ సైనికులకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయసేవలు అందించనున్నట్లు జిల్లా జడ్జి భీమారావు తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో లీగల్ సర్వీసెస్ క్లినిక్ ఏర్పాటు చేసి ఉచిత న్యాయ సేవలు అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం అనంతపురం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో కోవూరు నగర్‌లోని జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను జిల్లా జడ్జి ప్రారంభించారు. పెన్షన్, భూ వివాదాలు, కుటుంబ సమస్యలు తదితర అన్ని న్యాయ సంబంధిత సమస్యల పరిష్కారానికి మార్గం ఏర్పడనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.రాజశేఖర్, జిల్లా సైనిక సంక్షమ అధికారి పి.తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

'డిజైన్ థింకింగ్' కోర్సు ప్రారంభం



కోర్సును ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ)లోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సహకారంతో మూడో వ్యాల్యూ యాడెడ్ కోర్సు 'డిజైన్ థింకింగ్ సర్టిఫికెట్ కోర్సు'ను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత శుక్రవారం ప్రారంభించారు. నూతన కోర్సు మానవ కేంద్రీకృత డిజైన్ విధానాలను నేర్పిస్తుంది. విద్య, వ్యాపారం, వ్యవసాయం, సహజ అభివృద్ధి వంటి విభిన్న రంగాల్లో వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినూత్న పరిష్కారాలు అందించే సరళమైన, శక్తివంతమైన పద్ధతులు నేర్చుకోవడానికి ఈ కోర్సు దోహదం చేస్తుంది. కార్యక్రమంలో అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం సీఈఓ సి.చంద్రమౌళి, కోఆర్డినేటర్ కృష్ణుడు, డాక్టర్ పి.జ్యోతి, బి.రాజశేఖర్ పాల్గొన్నారు.


నిందితులను కఠినంగా శిక్షించాలి



శ్రావణి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: భర్త, అత్త మామల వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన శ్రావణి మృతదేహం వద్ద వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం రంగయ్య మాట్లాడుతూ... భర్త శ్రీనివాసులు, అత్తమామలు తీవ్రంగా వేధిస్తున్నారని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. భర్త, అత్త, మామలు టీడీపీ సానుభూతిపరులు కావడంతో పోలీసులు కేసును నీరుగారుస్తున్నారన్నారు. శ్రావణిది ఆత్మహత్య కాదని టీడీపీ నేతలు, పోలీసులు కలిసి హత్య చేశారని రంగయ్య ఆరోపించారు. శ్రావణి మృతి కారకులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మండల కన్వీనర్లు గొల్ల సూరి, హనుమంతురాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర నేత రామాంజినేయులు, వైస్ ఎంపీపీ కాంతమ్మ, మల్లి, బిక్కి హరి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'అమర భారతం'



నాటికను ప్రదర్శిస్తున్న క్యాంపస్ విద్యార్థులు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు దేశ స్వాతంత్య్ర సంగ్రామ ఘట్టాలను వివరిస్తూ 'అమర భారతం' పేరుతో ప్రదర్శించిన నాటిక అందరినీ ఆకట్టుకుంది.

దేశం మనదే.. తేజం మనదే

- మువ్వన్నెల రెపరెపలు
- జిల్లా అంతటా 79వ స్వాతంత్య్ర వేడుకలు
- సాంస్కృతిక కార్యక్రమాలతో ఉప్పొంగిన దేశభక్తి



పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకం ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న మంత్రి కేశవ్, చిత్రంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, ఎస్పీ జగదీశ్



అనంతపురం పోలీస్ పరేడ్ మైదానంలో స్వాతంత్ర్యోద్యమ ఘట్టాన్ని ప్రదర్శిస్తూ సాగిన సాంస్కృతిక ప్రదర్శన

మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం జిల్లా అంతటా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వేతర సంస్థలతో పాటు ఇళ్లపైన త్రివర్ణ పతాకం ఎగిరింది. ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు జాతీయ పతాకావిష్కరణ చేశారు. సారే జహాసే అచ్ఛా.. దేశం మనదే, తేజం మనదే.. తదితర జాతీయ గీతాల ఆలాపన, సాంస్కృతిక కార్యక్రమాలతో దేశభక్తి ఉప్పొంగింది. మువ్వన్నెలను ప్రతిబింబించేలా చిన్నారుల వస్త్రధారణ ఆకట్టుకుంది. ఇక వాహనదారులు జాతీయ పతాకాలతో ప్రదర్శించారు. స్వాతంత్య్రం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుంటూ వారి వేషధారణలతో చిన్నారులు అలరించారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం



ప్రసంగిస్తున్న మంత్రి కేశవ్

అనంతపురం అర్బన్: జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిద్దామని, సమష్టిగా పనిచేసి అగ్రస్థానంలో నిలుపుదామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం అనంతపురం పోలీసు పరేడ్ మైదానంలో జిల్లాస్థాయి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మంత్రి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ప్రజలకు తన సందేశాన్ని వినిపించారు. వేడుకల్లో జిల్లా న్యాయమూర్తి భీమరావు, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం సలీమ్, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఎస్పీ పి.జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ప్రగతిని, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేద్దామని అధికార యంత్రాంగానికి పిలుపునిచ్చారు. పీ4 కార్యక్రమం ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన, అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు.



సాంస్కృతిక ప్రదర్శనలో ఒక భాగం



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి





ముష్కరులతో భారత సైనికుల పోరాట సన్నివేశం, స్వాతంత్య్ర వేడుకలకు హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి తదితరులు

బ్రిటీష్ పాలనను తలపిస్తున్న కూటమి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం కార్పొరేషన్: దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు, బెదిరింపులు, కక్షసాధింపు చర్యలతో కూటమి ప్రభుత్వం బ్రిటీష్ పాలనను తలపిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందిస్తే.. ప్రస్తుత చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. అవినీతి పెచ్చుమీరిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో పూర్తి నెరవేర్చకపోగా.. అమలు చేస్తున్న అరకొర పథకాల్లో అనేక కొర్రీలతో అర్హులకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లోనూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఏకపక్షంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్, పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారన్నారు. పోలీసు వ్యవస్థ మరీ దారుణంగా తయారైందన్నారు. పోలీసులే దగ్గరుండి ఎన్నికల్లో అక్రమాలు జరిగేలా చేశారని విమర్శించారు. నాడు బ్రిటీష్ వారిపై ఏవిధంగా పోరాటాలు చేశారో.. కూటమి ప్రభుత్వంపై అలాంటి పోరాటాలు చేసే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తుందన్నారు. ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్య్రం అని, ఆ స్ఫూర్తితో తాము ప్రజల కోసం పోరాటాలు చేస్తామని, అందుకు ప్రతి కార్యకర్తా కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైఫుల్లాబేగ్, మల్లెమీద నరసింహులు, శ్రీదేవి, బాకే హబీబుల్లా, శ్రీనివాసులు నాయక్, అమర్‌నాథ్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కృష్ణవేణి, పెన్నోబులేసు, నాయకులు శ్రీనివాసులు, రియాజ్, అనిల్ కుమార్‌గౌడ్, సాకే కుళ్లాయిస్వామి, చంద్రలేఖ, హజరాబీ, రాధాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

దగ్గుపాటి వర్సెస్ వైకుంఠం

- పరస్పర ఆరోపణలతో తగ్గేదేలే అంటున్న నేతలు
- బజారునపడ్డ అనంతపురం అర్బన్ టీడీపీ పరువు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నేతల ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఆ పార్టీ పరువు బజారున పడినట్టయింది. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి మధ్య కొనసాగుతున్న ఈ రాజకీయ వైరం తారస్థాయికి చేరింది. స్వపక్షంలోనే విపక్షం అన్నట్టు కొనసాగుతున్న ఈ ఆరోపణలు చివరకు రచ్చకెక్కాయి. ఒకరిపై ఒకరు వ్యక్తిగత ఆరోపణలకు దిగి పార్టీ పరువు తీస్తున్నారని తెలుగు 'తమ్ముళ్లు' వాపోతున్నారు.

మీలా తాళిబొట్లు తెంచలేదు..

మీలాగా కొంతమంది తాళిబొట్లు తాను తెంచలేదని, ఎవరిమధ్యా గొడవలు పెట్టలేదని ప్రభాకర్ చౌదరిపై ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు సంధించారు. 'నాకు టికెట్ వచ్చినప్పటి నుంచి ఇబ్బందులు పెడుతున్నారు.. చాలా సంతోషం.. నాపై విచారణ చేస్తే క్లీన్‌చిట్ వస్తుంది. నేను కొందరిలాగా చైర్మన్‌గా ఉంటూ ఆస్తులు సంపాదించుకోలేదు, నేను ఇక్కడ స్టాండ్ అవుతాననే ఆందోళనతోనే ఇదంతా చేస్తున్నారు. చివరకు నా బర్త్‌డే రోజు ఫ్లెక్సీలు చూసి ఓర్వలేకపోయారు. గతంలో రహంతుల్లా ఎలా ఓడిపోయారో అందరికీ తెలుసు. మహాలక్ష్మి శ్రీనివాస్‌ను ఎవరు ఓడించారో అందరికీ తెలుసు. గతంలో ఆయన బీ ఫామ్ ఎలా తెచ్చుకున్నారో కూడా తెలుసు' అని విమర్శించారు.

నీ బండారం బయటపెడతా..

దగ్గుపాటి వ్యాఖ్యలకు ప్రభాకర్ చౌదరి దీటుగా స్పందించారు. 'ఇప్పుడు బయటపెట్టింది కొన్ని మాత్రమే.. ఇంకా నా దగ్గర చాలా ఆధారాలున్నాయి. మందుతాగి మహిళలతో ఎలా మాట్లాడారో తెలుసు. రాప్తాడు ప్రసాద్‌రెడ్డి హత్యకేసులో ముద్దాయి ఎవరో తెలుసు. రాప్తాడుకు చెందిన వారు నీ ప్రైవేటు సైన్యంగా ఉన్నారు. మైనార్టీ అమ్మాయి షాపు ఆక్రమణలో అక్కడున్నది నీ మనిషి కాదా? అమ్మాయిని ఎలా బెదిరించావో తెలుసు. రాత్రి మందుతాగి తెలుగు యువత నాయకుణ్ని ఎలా మాట్లాడావో తెలుసు. ఇవన్నీ బయటపెడతా. రామాంజనేయులు అనే వ్యక్తికి చెందిన 92 సెంట్ల భూమిని మీరు కబ్జా చేస్తే ఎస్పీకి ఫిర్యాదు చేసింది వాస్తవం కాదా? నీ వ్యవహారం వల్ల ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ప్రభావం పడుతోంది' అని అన్నారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు

- రాయల్టీ చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి
- తెలిసినా పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

గార్లదిన్నె: శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలంలో ఆదాయం కోసం అక్రమార్కులు అడ్డదారులు తొక్కుతున్నారు. అనధికారికంగా ఇసుక, మట్టి కొల్లగొట్టుకుపోతున్నారు. కళ్లెదుటే కనిపిస్తున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో అక్రమార్కులు సహజ వనరులను యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారు. ఇటీవల కల్లూరులో టీడీపీ మట్టి మాఫియా ఏకంగా రెవెన్యూ అధికారులపైనే దాడులు చేసిన విషయం విదితమే. అనుమతులు లేకుండా ప్రభుత్వ గుట్టల్లో హిటాచీ, జేసీబీ యంత్రాలతో మట్టి తవ్వకాలు జరిపి టిప్పర్ల ద్వారా రోడ్ల నిర్మాణాలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాయల్టీ చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు.

- ఇక గ్రామాల్లో కొందరు వ్యక్తులు ఎర్రమట్టి వ్యాపారాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాక్టర్లలో మట్టి తరలింపు కొనసాగుతోంది. కల్లూరులో సింగరప్ప కొండ, జంబులదిన్నె కొట్టాలలో ప్రభుత్వ గుట్ట, అదే విధంగా పలు గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో కూడా దర్జాగా మట్టి తవ్వకాలు చేస్తూ అక్రమ దందాను యథేచ్ఛగా చేపడుతున్నారు. వ్యాపారులకు ఎర్రమట్టి కాసులు కురిపిస్తోంది. అనధికారిక మట్టి తవ్వకాలను అరికట్టాల్సిన అధికారులు.. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి, మామూళ్ల మత్తులో జోగుతూ అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



జంబులదిన్నె కొట్టాల వద్ద గుట్ట నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

అనుమతి తప్పనిసరి

ప్రభుత్వ భూములు, పట్టా భూములు ఏ భూములలోనైనా మట్టి తవ్వకాలు చేయాలంటే మైనింగ్ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి ఏ సర్వే నంబర్‌లో తవ్వకాలు చేస్తున్నారు.. ఎంత లోతు తవ్వకాలు చేయాలి... ఎన్ని క్యూబిక్ మీటర్లు మట్టి తీసుకుంటున్నారు.. మట్టి తరలిస్తే భూగర్భజలాలు అడుగంటిపోయే అవకాశం ఉందా అనే వివరాలు కచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుంది.

– మల్లికార్జున, డిప్యూటీ తహసీల్దార్, గార్లదిన్నె

ఉత్తమ సేవలకు పురస్కారం

- ఆకట్టుకున్న శకటాలు
- ఉత్తమ సేవలు అందించిన 416 మంది ఉద్యోగులకు అవార్డులు
- స్వచ్ఛంద సేవా సంస్థలకు ఇచ్చిన అవార్డులపై విమర్శలు

అనంతపురం అర్బన్: అనంతపురం నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు సంబరంగా జరిగాయి. ఇందులో భాగంగానే ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ఉత్తమ సేవలు అందించిన జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన 416 మంది అధికారులు, ఉద్యోగులకు అవార్డులు అందించారు. అలాగే స్వచ్ఛందంగా సేవలందిస్తున్న 14 సంస్థల ప్రతినిధులకు అవార్డులు ఇచ్చారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలో ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా వీరంతా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

అవార్డులపై విమర్శలు

కొన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అవార్డుల ప్రదానంపై విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా అంబికా ఫౌండేషన్, దగ్గుపాటి ఫౌండేషన్‌కు అవార్డులు ఇవ్వడంపై పలువురు పెదవి విరిచారు. జిల్లాలో ప్రజలకు స్వచ్ఛందంగా, నిస్వార్థంగా సేవలందిస్తున్న సంస్థలు చాలా ఉండగా వాటికి ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అలాగే ఒక రెవెన్యూ అధికారితో పాటు పాటల ప్రోగ్రామ్‌లో పాల్గొనే ముగ్గురికి అవార్డులు ఇవ్వడంపైనా విమర్శలు వినిపించాయి.



స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మొదటి బహుమతి అందుకున్న నగర పాలక శకటం, రెండో బహుమతి సాధించిన హౌసింగ్ శకటం, మూడో బహుమతి సాధించిన వైద్య ఆరోగ్యశాఖ శకటం



ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ | మల్లికార్జునుడు, డిప్యూటీ కలెక్టర్ | రామకృష్ణారెడ్డి, ఎఫ్ఎస్ఓ | శ్రీనివాసులు, గుంతకల్లు ఆర్డీఓ | రూప్లానాయక్, సర్వేశాఖ ఏడీ | శ్రీనివాసరెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ | శ్రీనివాసయాదవ్, ఇండస్ట్రీస్ అధికారి | సురేఖారాణి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ | ప్రసాద్‌బాబు, డీఈఓ



తరుణ్‌కుమార్, నేషన్ హైవే పీడీ | విశ్వనాథ్‌రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ | తిమ్మప్ప, సైనిక సంక్షేమశాఖ అధికారి | రమ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి | అరుణకుమారి, డీసీఓ | వసంత లత, సూపరింటెండెంట్ | రియాజుద్దీన్, సూపరింటెండెంట్ | శోభారాణి, డీటీ, కలెక్టరేట్ | కనకరాజు, డీటీ, కలెక్టరేట్ | కిరణ్‌కుమార్, డీటీ, కలెక్టరేట్ | భారతి, అడిషనల్ డీఐఓ



వెంకటేశ్‌నాయక్, ట్రాఫిక్ సీఐ, అనంతపురం | శ్రీకాంత్, టూటౌన్ సీఐ, అనంతపురం | విజయభాస్కర్‌గౌడ్, సీఐ, డీటీఆర్‌బీ, అనంతపురం | హరినాథ్, డీసీఆర్‌బీ, అనంతపురం | క్రాంతికుమార్, సీఐ, ఎస్‌బీ అనంతపురం | ధరణికిషోర్, సీఐ, ఎస్‌బీ అనంతపురం | మహబూబ్‌బాషా, డీఎస్పీ, అనంతపురం | రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం | ఏ.శ్రీనివాసులు, ఎస్‌డీపీఓ, గుంతకల్లు | వెంకటేశ్వర్లు, ఎస్‌డీపీఓ, అనంతపురం రూరల్ | శ్రీనివాసరావు, ఎస్‌డీపీఓ, అనంతపురం



ఇలియాజ్ బాషా, ఏఎస్పీ, ఏఆర్ | సాయిప్రసాద్, సీఐ, తాడిపత్రి | మహానంది, సీఐ, ఉరవకొండ | వెంకటరమణ, సీఐ, రాయదుర్గం రూరల్ | మనోహర్, సీఐ, గుంతకల్లు | శేఖర్, సీఐ, అనంతపురం రూరల్ | ప్రతాప్‌రెడ్డి, సీఐ, పీటీసీ | అనుపమాజేమ్స్, డిస్ట్రిక్ లెప్రసీ ఆఫీసర్ | వలీఖాన్, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ | సోనియా, ప్రిన్సిపాల్, మెడికల్ కాలేజీ

సంబరాలు చేసుకునేందుకు సిగ్గుండాలి

- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి



గుంతకల్లు: 'పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ నాయకులు అరాచకాలు, అక్రమాలకు పాల్పడుతూ రిగ్గింగ్ చేసి గెలిచారనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. అలాంటప్పుడు టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకునేందుకు సిగ్గుపడాలని' ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి విమర్శించారు. శుక్రవారం ఆయన గుంతకల్లుకు విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. పోలీసులు, అధికారులను అడ్డుపెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ తరుపున ఏజెంట్లు లేరని, కనీసం ఓట్లు వేయడానికి వచ్చే ఓటర్లను కూడా అడ్డుకోవడం దారుణమన్నారు. కాళ్లపై పడినా కనికరం లేకుండా ఓటు వేయడానికి అనుమతించకపోవడం చూస్తుంటే తాలిబన్ల పాలనను రాష్ట్ర ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. టీడీపీకి వత్తాసు పడిన పోలీసు డిపార్టుమెంట్ తలదించుకోవాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్నారని మంత్రి నారా లోకేష్ అనడం సిగ్గుచేటన్నారు. పవన్‌కళ్యాణ్ పంచాయతీశాఖ మంత్రి ఉన్నా ఉపయోగం లేదన్నారు. పంచాయతీలకు నిధులు లేకపోవడంతో చిన్న పనులు కూడా సర్పంచులు చేయించలేకపోతున్నారు. అటు సినిమాలకు .. ఇటు రాజకీయాలకు కూడా ఆయన పనికిరాడన్నారు. వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అమరావతి ప్రాంతం సముద్రంలా తయరైందన్నారు. ఈనాడు, జ్యోతి, టీవీ5లకు అమరావతి పరిస్థితి కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

శ్రావణి మృతికి కారకులను శిక్షించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకపోగా, దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయి. కళ్యాణదుర్గంలో టీడీపీ నాయకులు, భర్త, వారి కుటుంబ వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న శ్రావణికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాడుతుంది' అని ఆ వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి పేర్కొన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. శ్రావణి భర్త శ్రీనివాసులతో పాటు టీడీపీకి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ శర్మాస్‌వలి కారణంగానే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు మృతురాలు శ్రావణి ఆడియో రికార్డు బయటకు వచ్చిందన్నారు. పోలీసులకు మూడుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆడియో స్పష్టంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం కారణంగానే తనకు ఈ పరిస్థితి ఏర్పడిందని, తన చావుకు టీడీపీనే కారణమని చెప్పారన్నారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలో అనంతపురంలో యువతి హత్య, ఏడుగుర్రాలపల్లిలో మైనర్‌పై సాముహిక అత్యాచారం జరిగాయన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు సుజాతరెడ్డి, నాయకురాళ్లు శోభారాణి, అనురాధ, భారతి, చంద్రలేఖ, లీలావతి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



డీసీఓకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: 'మలుగూరు పంచాయతీ నందమూరినగర్‌లోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఒకేసారి 10 మందికిపైగా విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. వారికి వెంటనే మెరుగైన వైద్య సేవలందించాలి' అని వైఎస్సార్ ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కదిరీష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను వారు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో సోమందేపల్లి కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఘటన మరువకముందే హిందూపురంలో ఒకేసారి పదిమందిపైగా విష జ్వరాలు వచ్చి ఆస్పత్రి పాలవడం బాధాకరమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ప్రిన్సిపాల్, హౌస్ మాస్టర్‌లను సస్పెండ్ చేయాలన్నారు.

అభివృద్ధి పట్టాలపై గుంతకల్లు డివిజన్



ఆర్‌పీఎఫ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఆర్ఎం

- పంద్రాగస్టు వేడుకల్లో డీఆర్ఎం సీఎస్ గుప్తా



మాట్లాడుతున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు: ప్రయాణికుల భద్రత, సరుకు రవాణా తదితర అన్ని విభాగాల్లో గుంతకల్లు డివిజన్ ఆల్ రౌండ్ ప్రతిభతో దూసుకెళ్తోందని రైల్వే డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్‌గుప్తా పేర్కొన్నారు. స్థానిక రైల్వే క్రీడా మైదానంలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి ఆర్‌పీఎఫ్‌ల నుంచి డీఆర్ఎం గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గడచిన నాలుగు నెలల్లో 15 మిలియన్ల ప్రయాణికులు టిక్కెట్ల కొనుగోలు ద్వారా రూ.361 కోట్లు ఆదాయం సమకూరిందన్నారు. దాదాపు 48 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపడం ద్వారా మరో రూ.8 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. డివిజన్‌లోని పాణ్యం–బుగ్గనపల్లి స్టేషన్ల మధ్య డబులింగ్ రైలు మార్గం పనులు పూర్తి చేశామన్నారు. అమృత్ స్టేషన్ స్కీమ్ కింద డివిజన్ పరిధిలోని 17 రైల్వేస్టేషన్లలో తొలి విడత కింద రూ.234 కోట్లు, రెండో విడత కింద రూ.358 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం డివిజన్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం యూ.సుధాకర్, సీనియర్ డీపీఓ కోర్డినేషన్ హెచ్ఎల్ఎన్ ప్రసాద్, సీనియర్ డీసీఎం మనోజ్, ఆర్‌పీఎఫ్ కమిషనర్ ఆకాష్ జైశ్వాల్ పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం



జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ అజయ్‌కుమార్

ప్రయాణికుల భద్రతే తమ లక్ష్యమని గుంతకల్లు రైల్వే జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక జీఆర్‌పీ ఎస్పీ కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ ఏడాది విశేష సేవలు అందించిన జీఆర్‌పీలకు అవార్డులను ప్రదానం చేశారు. డీఎస్పీ శ్రీనివాస ఆచారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. కియా ఎస్ఐ రాజేష్ వివరాల మేరకు.. కళ్యాణదుర్గం రూరల్ మండలంలోని దురదకుంటకు చెందిన కృష్ణమూర్తి (34) బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం బెంగళూరు నుంచి కళ్యాణదుర్గానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పెనుకొండ పరిధిలోని హరిపురం జంక్షన్ సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పింది. తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తి అనంతపురంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సుస్మిత ఉన్నారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

హిందూపురం: పట్టణంలోని మలుగూరు గురుకుల పాఠశాలను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం పాఠశాలలో వంటశాల నిర్వాహణ, వంటకాలు, తయారీ విధానం, తాగునీటి సదుపాయం వివరాలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ గదులు, వంటశాలలో పరిస్థితి, శుభ్రత పరిశీలించి వంట మనుషులకు సూచనలిచ్చారు. అలాగే డీఎంహెచ్ఓ, ఎంపీడీఓ సరస్వతిలకు పలు సూచనలిచ్చారు.

క్లుప్తంగా

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం కార్పొరేషన్: అధైర్య పడవద్దు.. తాము అండగా ఉంటామని ఎరుకుల కాలనీ ప్రజలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట రామిరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయం ఆవరణలో 43వ డివిజన్ పరిధిలోని ఎరుకుల కాలనీ ప్రజలు అనంతను కలిశారు. యాభై ఏళ్లుగా నివాసం ఉంటున్నామని తెలిపారు. పట్టాలతో పాటు పన్నులు చెల్లిస్తున్నప్పటికీ వందకు పైగా ఇళ్లకు అధికారులు నోటీసులు అతికించారన్నారు. స్పందించిన అనంత.. ఎవరూ భయపడాల్సిన పనిలేదని తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. కాలనీ వాసుల వెంట డివిజన్ కార్పొరేటర్ ఇసాక్ ఉన్నారు.

ఆడిటోరియం ప్రారంభం



ఆడిటోరియం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ లక్ష్మీనారాయణ

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కొత్తూరు ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాలలో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన నూతన ఆడిటోరియం భవనాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఆడిటోరియం విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ గురు ప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'మహిళలు ఉచితంగా ప్రయాణించొచ్చు'

అనంతపురం క్రైం: ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శుక్రవారం కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో ఒకటైన 'స్త్రీశక్తి' మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంలో భాగంగా బస్సును జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు, నగర ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, డిపో మేనేజరు నాగభూపాల్, కూటమి నేతలు లింగబలిజ చైర్మన్ స్వప్న, మధు, ఆర్టీఓ కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాప్ నగర కమిటీ ఎంపిక



ఐక్యత చాటుతున్న జాప్ నాయకులు

అనంతపురం: జాప్ (జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) నగరాధ్యక్షుడిగా చెరుకూరి రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి అనిల్ కుమార్ రెడ్డి, జాప్ జిల్లా అధ్యక్షుడు బండి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగర కమిటీని ఎంపిక చేశారు. గత 19 సంవత్సరాలుగా జర్నలిస్టుగా ఎనలేని సేవలు అందించిన చెరుకూరి రామాంజనేయులను నగర అధ్యక్షుడిగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జాప్‌లో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి జాప్ అసోసియేషన్ పూర్తి అండగా ఉంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ తరఫున అందే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అందించేందుకు కృషి చేస్తామన్నారు. నగర ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున, కార్యదర్శిగా కుంచపు భాస్కర్, సహాయ కార్యదర్శిగా ఎనుముల కుళ్లాయప్ప, కోశాధికారిగా సి.హరికృష్ణను ఎంపిక చేశారు.

ప్రథమ చికిత్స కేంద్రాల తనిఖీ



సూచనలిస్తున్న మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఎన్ఎస్ గేట్‌లోని పలు ప్రథమ చికిత్స కేంద్రాలను ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాబా క్లినిక్, ధనలక్ష్మి క్లినిక్‌ల బోర్డులు మార్చాలని ఆదేశించారు. క్లినిక్ అని బోర్డు పెట్టి రోగులకు పలు రకాల వైద్యం చేయడం నేరమన్నారు. ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ మీరు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. అలా కాకుండా ఇంజక్షన్, సెలైన్‌లను ఎక్కించడం లాంటివి చేస్తే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.



జెడ్పీ కార్యాలయ ఆవరణలో జెండాకు వందనం చేస్తున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



కలెక్టరేట్, ఖజానా శాఖ ఉద్యోగులతో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



జెండా ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి

మురిసిన త్రివర్ణం



సిబ్బందికి మిఠాయి అందజేస్తున్న ఎస్పీ జగదీష్



రాప్తాడు: జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ హేమావతి



అనంతపురం: జెండా వందనం చేస్తున్న ఏడీడీఎల్ ఏడీ రవిబాబు



విజ్ఞాన్ స్కూల్‌లో ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసాలు

మెరుగైన సేవలు అందిద్దాం..

అనంతపురం: స్వాతంత్య్ర సమరయోధుల స్ఫూర్తితో విధుల్లో పునరంకితమై ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దామని ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం జిల్లా స్పెషల్ బ్రాంచి కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సిబ్బందికి స్వీట్లు పంచి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐలు ధరణి కిశోర్, క్రాంతికుమార్, ఎస్సైలు లోక్‌నాథ్ చౌదరి, వెంకట కృష్ణ, షఫీ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత జాతీయ జెండాను ఎగురవేశారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో వీసీ ఎస్ఏ కోరి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ జయచంద్రా రెడ్డి, ఓటీపీఆర్ఐలో డైరెక్టర్ సుబ్బారెడ్డి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

అనంతపురం సిటీ: స్వాతంత్య్ర సమరయోధుల స్ఫూర్తితో నేటి తరం నేతలు, యువత ముందడుగు వేసి, వారి ఆశయ సాధన కోసం చొరవ చూపాలని ఉభయ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించారు. మాజీ సైనికులతో గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కులమతాలు, పార్టీలు, ప్రాంతాలకతీతంగా అభివృద్ధి, సంక్షేమం సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన 37 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

- పంచాయతీరాజ్ శాఖ సర్కిల్, ఈఈ కార్యాలయంపై ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రభాకర్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. సబ్ డివిజన్–1, 2 కార్యాలయాలపై డీఈఈలు లక్ష్మీనారాయణ, కృష్ణజ్యోతి మువ్వన్నెల జెండా ఎగురవేశారు. క్వాలిటీ కంట్రోల్ ఉమ్మడి జిల్లా కార్యాలయంపై ఈఈ మల్లికార్జున మూర్తి, క్యూసీ సబ్ డివిజన్ కార్యాలయాలపై డీఈఈలు రవీంద్ర, లోకన్న జెండా ఆవిష్కరించారు. రైల్వే స్టేషన్ వద్ద మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్, జీఆర్‌పీ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ వెంకటేశ్వర్లు జెండా ఎగురవేశారు. కార్మిక శాఖ కార్యాలయం వద్ద అసిస్టెంట్ కమిషనర్ లావణ్య మూడు రంగుల జెండా రెపరెపలాడించారు.

నగరాభివృద్ధికి పాటుపడదాం

అనంతపురం కార్పొరేషన్: ఎందరో మహనీయుల త్యాగ ఫలితంతోనే స్వాతంత్య్రం సిద్ధించింది. ఆ మహనీయుల స్ఫూర్తితో నగరాభివృద్ధికి పాటుపడదామని మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ ఆవరణలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. అనంతరం ఉత్తమ అధికారులు, సిబ్బందికి కమిషనర్ బాలస్వామి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో..

ప్రభుత్వ వైద్య కళాశాల, సర్వజనాస్పత్రిలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ రామకృష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

అనంతపురం అగ్రికల్చర్: ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. సీఈఓ కె.సురేఖారాణి, నాబార్డు డీడీఎం అనురాధ, ఇతర ఉద్యోగులు గౌరవ వందనం చేశారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో చైర్మన్ నెట్టెం వెంకటేశులు జెండా ఎగురవేశారు. వ్యవసాయశాఖ, పశుశాఖ, ఉద్యాన, ఏపీఎంఐపీ, పట్టుశాఖ, రూరల్ ఏవో, మార్కెట్‌యార్డు కార్యాలయాల్లో జేడీలు ఉమామహేశ్వరమ్మ, డాక్టర్ టీపీ సుధాకర్, బి.రఘునాథరెడ్డి, డి.ఉమాదేవి, ఐ.విజయకుమార్, వెంకటకుమార్, కె.గోవిందు తదితరుల ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

పాఠశాలల్లో..

అనంతపురం ఎడ్యుకేషన్: స్వాంతత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని వివిధ స్కూళ్లల్లో మువ్వన్నెల జెండా మురిసింది. విద్యార్థుల్లో దేశభక్తి ఉప్పొంగింది. సంబరాలు అంబరాన్నంటాయి. ఈ తరం విద్యార్థులు మంచి నడవడిక, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి, భవిష్యత్తులో మంచి రంగాలలో అత్యుత్తమంగా రాణించాలని టీచర్లు కోరారు. జాతీయ నాయకుల వేషధారణల్లో చిన్నారులు అలరించారు.

విద్యుత్ శాఖ కార్యాలయంలో..

అనంతపురం టౌన్: 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్ఈ శేషాద్రి శేఖర్ జాతీయ జెండాను ఎగరవేసి ఉద్యోగులతో కలిసి గౌరవ వందనం చేశారు. ప్రతిభ కనబరచిన ఉద్యోగులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతపురం డీ5 సెక్షన్ పరిధిలో పని చేస్తున్న లైన్‌మెన్ వెంకట నారాయణ, ఎల్ఐ బాషా అవార్డులు స్వీకరించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ రమణరావుతో కలిసి యూనస్, ఆశాఖ ఉద్యోగులు జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు.

సమాచార శాఖలో..

అనంతపురం అర్బన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సమాచార పౌర సంబంధాల (ఐఅండ్ పీఆర్)శాఖలో వేడుక నిర్వహించారు. జాతీయ పతాకాన్ని డీఐపీఆర్ఓ బాలకొండయ్య ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ వెంకటరమణ, ఏపీఆర్ఓ ఫక్రుద్దీన్, పీఆర్ఓ సూర్యనారాయణరెడ్డి, సిబ్బంది ప్రభావతి, కమల్ బాషా, చాంద్‌బాషా, ఆంజనేయులు, దామోదర్ రెడ్డి, సుహాసిని, తాజుద్దీన్, రామాంజనేయులు, భాస్కర్, ఖాసీమ్, నజీర్, రాజారావు, అమ్మన్ని, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో

అనంతపురం అర్బన్: రెవెన్యూ ఉద్యోగుల సంఘం, జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కృష్ణకళామందిర్‌లోని సంఘం కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దివాకర్‌రావు, మాజీ అధ్యక్షుడు మల్లికార్జు, రిటైర్డ్ ఆర్‌డీఓలు, తహసీల్దార్లు ఈశ్వర్, బాలగంగాధర్, వెంకటేశ్వర్లు, నాగభూషణం, రామశేఖర్, రామచంద్రారెడ్డి, రాజేంద్రప్రసాద్, సంఘం కలెక్టరేట్ కార్యదర్శి భరత్‌కుమార్ పాల్గొన్నారు.

రాప్తాడు: దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన మహనీయుల త్యాగనిరతిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి అన్నారు. జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జూటూరు సాకే వెంకటేష్, సీఐ టీ.వి.శ్రీ హర్ష, ఎంఈఓ మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో మంటిస్సోరి ఎలీట్ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మంత్రి పయ్యావుల చేతులమీదుగా విద్యార్థులు ప్రశంసాపత్రం అందుకున్నారని ఎండీ క్రిష్ణ భరత్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఉత్తమ సేవలు అందించిన వైద్య సిబ్బందికి వైద్యాధికారి శివకృష్ణ పురస్కారాలు అందజేశారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

అనంతపురం అర్బన్: స్థానిక సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.నారాయణ స్వామి, నగర కార్యదర్శి శ్రీరాములు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేశవరెడ్డి, పద్మావతి పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం జిల్లా రంగస్థల కళాకారులు దేశభక్తిని చాటుతూ జెండాను ఆవిష్కరించారు. స్థానిక లలిత కళాపరిషత్తు, స్వచ్ఛంద సంస్థలు, మై భారత్ కార్యాలయాల వద్ద జాతీయ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, ఆదినారాయణరెడ్డి, రామగోవిందసాగర్, సోమిరెడ్డి, రామాంజనేయులు, కుళ్లాయప్ప, బాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల పంపిణీ..

ఆత్మకూరు: ప్రతి ఒక్కరు దేశభక్తి చాటాలని ఎంపీపీ సుబ్బర హేమలత, ఎంపీడీఓ లక్ష్మినరసింహ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో జెండాను ఎగరవేశారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గొరిదిండ్ల తండా అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు గ్రీన్‌కో విండ్ పవర్ కంపెనీ వారు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నీలిమ, ఆత్మకూరు సర్పంచ్ వరలక్ష్మి తదితరులు పాల్గన్నారు.

మహనీయుల బాటలో నడవాలి

అనంతపురం అర్బన్: దేశ స్వాతంత్య్రం కోసం త్యాగాలు చేసిన మహనీయుల బాటలో అందరూ నడవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్వాతంత్య్ర దినోత్సవం వేడుకలు నిర్వహించారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్ఓ ఎ.మలోల, పరిపాలనాధికారి అలెగ్జాండర్, విభాగాల సూపరింటెండెంట్లు వసంతలత, యుగేశ్వరి దేవి, రియాజుద్దీన్, కేఆర్ఆర్‌సీ ఇన్‌చార్జి తహసీల్దార్ జయశ్రీ, సర్వే శాఖ ఏడీ రూప్లా నాయక్, ఏటీఓ రాణి, ఎస్‌టీఓ తిరుమలరెడ్డి, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు పాల్గొన్నారు.



ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



జేఎన్‌టీయూ(ఏ)లో జెండా వందనం చేస్తున్న వీసీ సుదర్శన రావు



సీయూఏపీలో జెండా ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి



శ్రీచైతన్య స్కూల్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న సిబ్బంది



మాంటిస్సోరి పాఠశాలలో జాతీయ జెండా ఆవిష్కరణ

సేవలకు ప్రశంస



మంత్రి పయ్యావుల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ కుమారి

నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పురస్కారాలు అందజేశారు. విధి నిర్వహణలో బాధ్యతగా పని చేయాలని సూచించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



రాకేష్ నాయక్, ఏఓ, అనంతపురం



జాకీర్ హుస్సేన్, ఎక్సైజ్ ఎస్ఐ



అలీ అహ్మద్, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్



శ్రీకాంత్, సీసీ నగరపాలక సంస్థ



యుగంధర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్



వెంకటనారాయణ, లైన్‌మెన్



నాగరాజు, హోంగార్డు



శ్రీతేజ, జూనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్



పవన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్



హర్షవర్ధన్, టీఎంయూ



ప్రవీణ్, ఎస్ఐ, అనంతపురం



సురేంద్ర రెడ్డి, మెడికల్ ఆఫీసర్



శ్రీనివాసులు, డీఈఈ



సతీష్ రెడ్డి, హెచ్ఓడీ

సిద్ధార్థ దివ్యన్సీ హాస్పిటల్ ప్రారంభం

అనంతపురం మెడికల్: నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిద్ధార్థ్ దివ్యాన్సీ ఆస్పత్రిని ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తదితరులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎండీ డాక్టర్ శంకర్ నారాయణ, డాక్టర్ హిమజ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ డీఎస్సీ విజేతలకు చెక్కుల పంపిణీ

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ డీఎస్సీ పరీక్షలు ఉత్తమ ప్రతిభ చాటిన అభ్యర్థులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, సొసైటీ ప్రతినిధులు రమేష్, దీప్ కిరణ్ రెడ్డి, రంగ, నాగ శివ, కుమార్, గాయత్రి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం



అలంకరణలో రాధాపార్థసారథులు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: ఇస్కాన్ మందిరం వేదికగా మూడు రోజుల పాటూ అంగరంగ వైభవంగా సాగే శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం విశ్వశాంతి మహాయజ్ఞంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం హనుమద్ సేవ, మధ్యాహ్నం హరినామ సంకీర్తన వీనుల విందుగా సాగాయి. మందిరంలో కొలువైన రాధా పార్థసారథులను విశేషంగా అలంకరించారు. సాయంత్రం ఇస్కాన్ మందిరం జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు నేతృత్వంలో కృష్ణాష్టమి వేడుకలకు మరింత శోభను తెచ్చే ఉట్టికొట్టు ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. వందలాది మంది కృష్ణభక్తులతో పాటూ చిన్నారి గోపికలు, చిన్ని కృష్ణులు మందిర ప్రాంగణంలో సందడి చేస్తూ అలరించారు. ఈ సందర్భంగా సాగిన సాంస్కృతిక కార్యక్రమాలతో కృష్ణాష్టమి వేడుకలకు కళాకారులు ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికారు. రాత్రి ఊంజల సేవ, శయన హారతి జరిగాయి. శనివారం జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని మహా పుష్పాభిషేకం, దీపోత్సవం జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకోవాలని ఇస్కాన్ ప్రతినిధులు కోరారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

అనంతపురం కల్చరల్: భావసార క్షత్రియుల ఆరాధ్యదైవమైన శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలను శనివారం వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు రామనగర్‌లోని భవసారక్షత్రియ సమాజ్ ప్రతినిధులు నాగరాజరావు, ఆనంద్ తెలిపారు. ఉదయం ప్రత్యేక అభిషేక, అలంకార సేవలు, సాయంత్రం దైహండి (ఉట్టికొట్టు ఉత్సవం) దాండియా కార్యక్రమాలు నేత్రపర్వంగా జరుగుతాయన్నారు. చిన్నారి కృష్ణులు, గోపికల నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. సుభాష్ రోడ్డులోని వేణుగోపాల స్వామి ఆలయం, అరవింద నగర్‌లోని శ్రీకృష్ణమందిరం, గీతామందిరంతో పాటూ లలిత కళాపరిషత్తులో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరగనున్నాయి.

శిల్పారామంలో..

అనంతపురం రూరల్: కృష్ణాష్టమిని పురస్కరించుకుని శిల్పారామంలో శనివారం వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఏఓ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. చిన్నారులకు కృష్ణుని వేషధారణ, ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. గ్రీన్ ఆర్మీ, శక్తి శారీస్ వారి సహకారంతో అమృత కూచిపుడి కళానిలయం నృత్య గురువు నాగరాజు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సీనియర్ కవి ఒంటెద్దు రామలింగారెడ్డి రచించిన 'ఆచారాలు–సంప్రదాయాలు' పుస్తకాన్ని అరసం (అభ్యుదయ రచయితల సంఘం) ఆధ్వర్యంలో ఈనెల 17న ఆవిష్కరిస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తన్నీరు నాగేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీఓ హోమ్‌లో జరిగే కార్యక్రమానికి కవులు, రచయితలు హాజరుకావాలని కోరారు.